# చందమామ

కిటికీలోనించి చల్లని వెన్నెల గది అంతా వ్యాపిస్తోంది. చందమామ కనిపిస్తున్నాడు గుండ్రంగా తెల్లగా! పక్కమీద పరచిన తెల్లని దుప్పటి-వెన్నెల కాంతిలో మల్లెపువ్వులా ప్రకాశిస్తోంది. కిటికీ ఊచలకు అల్లుకున్న మల్లెతీగ నుంచి మల్లెపూల వాసన గది అంతా నిండుతోంది. ఈ ఏడాది మల్లెచెట్టు విరగబూసింది.

దీపం ఆర్పేసి చందమామను చూస్తూ కిటికీ దగ్గర పడుకున్నాను. మనస్సు నిర్మలంగా ప్రశాంతంగా ఉంది. పగలంతా స్కూలు పనితో తీరిక లేకుండా ఉంది. అంచేత కాస్త అలసటగా ఉంది. మనసులో ఏవేవో ఆలోచనలు అలలలా వస్తున్నాయి.

నేను శేఖర్‌ను ప్రేమించాను. శేఖర్ మా ఎదురింటివాళ్ళబ్బాయి. అతనూ నేనూ చిన్నప్పటినుంచి కలిసి ఆడుకున్నాం. కలిసి పెరిగాం. నేను బి. ఎ. చదువుతూ ఉండగా అతను పై చదువులకిని అమెరికా వెళ్ళాడు. ఎందుకో నేను అతను నన్ను పెళ్ళి చేసుకుంటాడని ఆశలు పెట్టుకున్నాను. అమెరికానించి తిరిగి రాగానే ఆ విషయం ప్రస్తావిస్తాడని అనుకున్నాను. అందుకే మా అమ్మా నాన్నా నా కోసం సంబంధాలు చూస్తూ ఉంటే నేను అంత ఆసక్తి చూపించలేదు. ఎన్ని మంచి సంబంధాలు వచ్చినా నాకు నచ్చలేదని, వద్దంటూ వచ్చాను. నా మనసు తెలియక అమ్మా నాన్నా తికమకపడ్డారు. అయినా నన్ను బలవంతం పెట్టడానికి నచ్చ చెప్పడానికి ఎక్కువ ప్రయత్నించలేదు.

శేఖర్ అమెరికా నుంచి తిరిగి వచ్చాడు. నా ఆశలన్నీ నిరాశలై నాయి. అతను తనకు అమెరికాలో పరిచయమైన ఒక పంజాబీ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఆ అమ్మాయిని తీసుకునే మా ఊరు వచ్చాడు. ఆ అమ్మాయిని తీసుకునే మా ఇంటికి వచ్చాడు-మమ్మల్ని చూపటానికి. నే నది భరించలేకపోయాను. ముఖమెత్తి ఆ పిల్లను పలకరించలేకపోయాను. లోపలకు వెళ్ళిపోయాను. నా బాధను లోలోపలే అణచుకున్నాను. అమ్మా నాన్నా అతనితో కాస్సేపు కబుర్లు చెప్పారు. అతను నన్ను గురించే మాట్లాడుతున్నాడు. "వనజ ఏదీ ? ఏం చేస్తోంది ? బి. ఎ. పూర్తయిందా? ఎమ్. ఎ. చదవలేదా ? పెళ్ళి సంబంధాలు చూస్తున్నారా ?" ఇలా సాగు తూంది సంభాషణ. నేను అంతా లోపల్నించి వింటున్నాను. కాని బయట పడలేదు. కాస్సేపటికి వాళ్ళు వెళ్ళిపోయారు.

శేఖర్ పెళ్ళైన తరువాత నేను క్రమంగా నా మనసు మార్చు కున్నాను. అతని గురించి ఇంక ఆలోచించడం వ్యర్థం అని త్వరలోనే తెలుసుకున్నాను. నేనూ, నా బ్రతుకుబాట సరిదిద్దుకుని సుఖపడాలని, స్థిర పడాలని అనుకున్నాను. అమ్మా నాన్నా కుదిర్చిన సంబంధం చేసుకోడానికి ఇష్టపడ్డాను. నాలో మార్పుకు వాళ్ళు సంతోషించారు.

ఒక రోజు రవి వచ్చాడు-నన్ను చూడడానికి పెళ్ళి చూపులకు. హాలులో ఒక మూలకుర్చీలో అతను కూర్చుంటే, ఇంకోమూల కుర్చీలో నన్ను కూర్చోపెట్టారు. అతనికేసి చూడటానికి నాకు భయం, సంకోచం. ఎల్లాగో ఒక్కక్షణం ఓరకంట చూచాను. అతను అందంగా ఉన్నాడు. ఒడ్డూ, పొడుగూ, ముఖాన మంచి వర్చస్సు, ఠీవిగా ఉన్నాడు. నా మనస్సు తృప్తిపడింది. ఆ క్షణమే మళ్ళా సంకోచం తల ఎత్తింది. అతనికి నేను నచ్చుతానో లేదో అని మనసు కాస్త నిరాశ చెందింది.

మూడు రోజులకు సంబంధం తెచ్చినాయన వార్త తెచ్చాడు. "పెళ్ళి

కొడుక్కు పిల్ల నచ్చింది. ఇంక కట్నం కానుకలు మాట్లాడుకుని పెళ్ళి ఏర్పాట్లు చెయ్యొచ్చు" అని. మా వాళ్ళు సంతోషించారు. డబ్బుకేమీ వెనకాడలేదు. అడిగిన కట్నానికి ఒప్పుకుని పెళ్ళి ప్రయత్నాలు ఘనంగానే జరిపారు. వాళ్ళకు నేను ఒకత్తెనే ఆడపిల్లను గదా! ముద్దూ మురిపెం అన్నీ బాగా జరపాలనే తాపత్రయం. రవి నన్ను పెళ్ళి చేసుకోటానికి ఒప్పుకున్నందుకు నా మనసు తృప్తిపడింది. మోడు వారిన చెట్టు వసంతానికి ఎదురు చూసినట్లు నేను కొత్త జీవితానికి, కొత్త కోర్కెలతో ఎదురు చూడసాగాను.

ఆకాశమంత పందిరీ, భూదేవి అంత అరుగూ కాకపోయినా పెళ్ళి ఆడంబరంగానే జరిగింది. బంధువులు, స్నేహితులూ చాలా మందే వచ్చారు. పెళ్ళి రోజు సాయంత్రం రిసెప్షన్ జరిగింది. రవినీ, నన్నూ ఒక సోఫాలో కూచో బెట్టారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 వరకూ అలాగే దంతపు బొమ్మల్లా కూచున్నాం చలనం లేకుండా. రవికి కొత్త సూటులో ఉక్కపోస్తూన్నట్లుంది. పదేపదే కర్చీఫ్‌తో మెడ తుడుచుకుంటున్నాడు. నాకు పట్టుచీర, ఒంటినిండా నగలు, ఊపిరాడటం లేదు. ఎందరో వస్తున్నారు. పోతున్నారు. అందరిని చూచి రవీ, నేనూ యాంత్రికంగా నవ్వుతున్నాం. ఒక్కొక్కప్పుడు వాళ్ళు ఎవరో తెలియకుండానే. హఠాత్తుగా శేఖర్ నా ఎదుట ప్రత్యక్షమయ్యాడు - ఒక ప్రజెంట్ పాకెట్‌తో. ఆ పాకెట్ నా చేతిలో ఉంచి అభినందనలు చెప్పాడు. అతన్ని చూడగానే నా ముఖం వెల వెల బోయింది. నేనేం మాట్లాడలేకపోయాను. యాంత్రికంగా పాకెట్ అందుకొని తలవంచుకున్నాను. కాస్సేపు గుండె దడదడ లాడింది. శేఖర్ అక్కడ ఎక్కువసేపు ఆగలేదు. రవిని ఏదో పలకరించాడు. ఏమన్నాడో సరిగా తెలియదు. రవి మౌనంగా ఉన్నాడు. అంతే శేఖర్ అక్కడినించి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిన కాస్సేపటికి

నేను కొత్త కోలుకున్నాను. తల ఎత్తి రవికేసి చూశాను. అతను నాలో మార్పు గమనించినట్లున్నాడు. అతని ముఖంలో చిరునవ్వు మాయమైంది. ముఖం కందగడ్డలా జేవురించి ఉంది. నాకు కొంచెం భయమనిపించింది. మళ్ళీ సర్దుకున్నాను. కాస్సేపటికి రిసెప్షన్ పూర్తి అయింది.

ఆ రాత్రి నన్ను చక్కగా అలంకరించారు-గదిలోనికి పంపటానికి స్నానం చేయించి తెల్లని పట్టుచీర కట్టారు. తలనిండా మల్లెపూలు. ఒంటి నిండా పన్నీరు, అత్తరు. అదంతా నాకేమిటో ఎబ్బెట్టుగా ఉంది. అయినా అద్దంలో చూసుకున్నప్పుడు నాలో ఏదో కొత్త అందం వచ్చినట్లు నాకే అనిపించింది. నా మనసు సంతోషంతో నిండి ఉంది. గదిలో అడుగు పెట్టగానే రవి నన్ను ఆప్యాయంగా పలకరిస్తాడని, ఆప్యాయంగా నా మీద చేయి వేస్తాడని కలలు కన్నాను. కాని అల్లా ఏమీ జరగలేదు. అతను కొంచెం కటువుగా నన్ను అడిగిన మొదటిప్రశ్న. "ఇందాక వచ్చిందెవరూ?" అని. నా కేమీ అర్థంకాలేదు. తెల్లబోతూ "ఎవరూ?" అన్నాను. అతను మళ్ళా రెట్టించి అడిగాడు, "అదే, ఇందాక వచ్చాడే, నీకు ప్రెజెంటు ఇచ్చాడూ, అతనెవరూ ?" అన్నాడు. అప్పటికీ సందిగ్ధంగా ఉన్నా అతను శేఖర్‌ను గురించి అడుగుతున్నాడని ఎల్లాగో పోల్చుకున్నాను. సరళంగానే జవాబు చెప్పాను "అతని పేరు శేఖర్. మా ఎదురింట్లో ఉంటాడు, అమెరికాలో ఇంజనీర్ చదివాడు." రవి కాస్సేపు మౌనంగా ఉన్నాడు. మళ్ళా చాలా సాఫీగా అడిగాడు. "అతన్ని నువ్వు ప్రేమించావా ?" అని. ఆ మాట నా నెత్తిన పిడుగు పడినట్లయింది. ఒళ్ళంతా గజగజా వణికి పోయింది. ఈ ప్రశ్నకు ఏమని సమాధానం చెప్పను? "లేదు" అంటే అది నిజం కాదు. "అవును" అంటే అంటే అది కూడా నిజం కాదు. ఇప్పుడు నేను శేఖర్‌ను ప్రేమించటంలేదు. రవినే ప్రేమిస్తున్నాను. రవితో నా

జీవితం మూడు పూవులు, ఆరుకాయలుగా సుఖప్రదం చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. శేఖర్ జ్ఞాపకం ఎప్పుడో మరుగునపడి పోయింది అతన్ని గురించి నేనిప్పుడు ఆలోచించటం లేదు. మనసులో తికమకపడుతూ ఆలోచనలతో సతమతమవుతూ నేను రవికి ఏమీ సమాధానం చెప్పలేదు. రవి మళ్ళా రెట్టించి అడగలేదు. నా మౌనం అతని అనుమానాన్ని దృఢపరచినట్లుంది అతను వెళ్ళి మౌనంగా కళ్ళు మూసుకు పడుకున్నాడు. నేను దిగాలుపడి సోఫాలో కూర్చున్నాను ఆ రాత్రి అమృత భాండంలో విషపు చుక్క పడింది.

రవీ, నేనూ మద్రాసులో కాపురం పెట్టాం. రవి ఎప్పుడూ నాకు చనువివ్వలేదు. ఎన్ని రోజులు గడచినా ముభావంగానే ఉంటున్నాడు. ఎడం ఎడంగానే ఉంటున్నాడు. అసలు అతను ఇంట్లో ఉండేదే తక్కువ. ఆఫీసు మేమున్న ఇంటికి చాలా దూరం. ఉదయం వెళితే రాత్రి ఏ ఎనిమిదికో వస్తాడు. అతను ముభావంగా ఉంటూ ఉంటే నాకూ అతనంటె భయం పోలేదు. రవి శేఖర్‌ను మరచిపోలేదు. రోజుకొకసారైన అసూయతో శేఖర్‌ను గురించి నన్ను ఎత్తిపొడుస్తూనే ఉండేవాడు. అది నాకు ఎప్పుడూ సూది మొనలా గుచ్చుకునేది. విపరీతమైన బాధ కలిగేది. ఏ శేఖర్‌ను నేను మరచిపోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నానో ఆ శేఖర్‌ను తన అసూయతో రవి మాటిమాటికి నాకు గుర్తుచేసేవాడు. చందమామలో మచ్చ ఉన్నట్లు రవిలో అనుమానమూ, అసూయ పాతుకుని ఉన్నాయి. వాటిని పోగొట్టటం నాకు సాధ్యంకాలేదు. క్రమంగా అతనిలో మార్పు వస్తుందని ఆశపడ్డాను. పరిచారికలా అతను మెచ్చుకున్నా మెచ్చుకోకపోయినా సేవలన్నీ చేస్తూ వచ్చాను. అతని ఎత్తిపొడుపు మాటలకు నొచ్చుకోకుండా అలవాటు పడ్డాను. అయినా అతని వైఖరిలో మార్పు రాలేదు. నేను రాత్రింబవళ్ళు లోలోపల శేఖర్‌నే స్మరిస్తున్నానని అతని అపోహ. రవి

ప్రవర్తనకు దిగులు పడుతూ నేను ఉదాసీనంగా ఉంటే అతను "శేఖర్ కోసం దిగులు పడుతున్నావా ?" అని ఎత్తిపొడిచేవాడు. ఈ కాపరం ఇలా ఎన్నాళ్ళు సాగుతుంది-అని నేను బాధపడేవాన్ని. శేఖర్ ఎక్కడున్నాడో తెలియదు. అతనికి మా గొడవ తెలియదు. అయినా, రవికి నాకూ మధ్య శేఖర్ పానకంలో పుడకలా ఉన్నాడు.

నాకొక బాబు పుట్టాడు. నేను ప్రసవించి ఆస్పత్రిలో ఉండగా రవి నన్ను చూడటానికి వచ్చాడు చాలా రోజుల తరువాత. అతని ముఖంలో మార్పు ఉంది. ప్రశాంతంగా ఉంది. బాబుని చూచి అతను సంతోషపడ్డాడు. ఈ మార్పు చూచి నేను సంతోషపడ్డాను అతను ఆప్యాయంగా నా చేయి పట్టుకుని "బాబుకు ఏంపేరు పెడదాం ?" అన్నాడు. నేను అప్రయత్నంగా "చంద్రశేఖర్" అన్నాను. నాలో ఏ ఇతర ఆలోచనా లేదు. చంద్రశేఖరు నా ఇష్టదైవం. ఆ పేరు నాకు ఇష్టం-అంతే. కాని రవి అపార్థం చేసుకున్నాడు. వెంటనే అతని ముఖంలో చిరునవ్వు మాయమైంది ముళ్ళమీద ఉన్నట్లు కాసేపు ఉండి వెళ్ళిపోయాడు. నేను నా తెలివితక్కువకు దిగులు పడి క్రుంగిపోయాను.

బాబుకు మూడవనెల రాగానే నేను మళ్ళా మద్రాసు వెళ్ళాను. రవి బాబును ప్రేమగానే చూచాడు. నాతోకూడా ఇదివరకు కన్నా కొంత మెరుగు. అయితే మా ఇద్దరి మధ్యా ఉన్న శేఖర్ నీడ మమ్మల్ని వదలలేదు. అప్పుడప్పుడూ అది తలఎత్తుతూనే ఉంది. ఎప్పుడో ఒకసారి అనుకోకుండా అసూయతో ఏవో ఎత్తిపొడుపు మాటలు అంటాడు నా మనసు చివుక్కుమంటుంది అంతే. ఆ రోజు పచ్చని ఆకులో ముల్లు గుచ్చినట్లుంటుంది.

బాబుకు రెండేళ్ళు వచ్చాయి. నా పెళ్ళై నాలుగేళ్ళయింది. ఇప్పుడిప్పుడు రవి నన్ను ఎత్తిపొడవడం నాకు విసుకు కలిగిస్తోంది. కొన్నాళ్ళు నేను తొలగిపోతేనేగానీ రవిలో మార్పు రాదేమోననిపించింది.

ఒక తీర్మానానికి వచ్చి ఒక రోజు రవితో చెప్పాను. "మీరు శేఖర్‌ను గురించి నన్ను ఎత్తిపొడవడం మానేస్తే తప్ప నే నింక ఉండలేను. కొన్నాళ్ళు బాబుతో మా ఊరు పోతాను. మళ్ళా మీలో మార్పు వచ్చి మీరు రమ్మని రాస్తేనే వస్తాను. ఒట్టి అనుమానాలతో నన్నెందుకు హింసిస్తారు?" ఈ మాటలు కొంత ఆవేశంతో చెప్పాను రవి ముఖం చిట్లించుకున్నాడు. ఏం మాట్లాడలేదు. మర్నాడు ప్రయాణమై నేను మా ఊరు వచ్చాను. ఇక్కడకు రాగానే కాలక్షేపానికి ఒక నర్సరీ స్కూల్లో టీచరుగా చేరాను. అమ్మా నాన్నా ఏమీ అనలేదు. "ఒంట్లో బాగుండ లేదు; కొన్నాళ్ళు ఇక్కడ ఉంటాను" అని చెప్పాను. రోజు రోజు రవి ఉత్తరం వస్తుందేమోనని ఎదురు చూస్తున్నాను. అది ఎప్పుడు వస్తుందో ఏమో!

చందమామ చల్లగా ప్రకాశిస్తున్నాడు. బాబు హాయిగా నిద్ర పోతున్నాడు. లేచి దీపం వేశాను పిల్లల పత్రికలోని కథలు చదువుతున్నాను. మనసు ఆలోచనలు లేకుండా తేలికగా ఉంది. ప్రొద్దున్నే ఈ కథలు చెపితే పిల్లలు ఆనందంగా వింటారు. అది తలుచుకున్నాను. నాకూ ఆనందం కలిగింది.

*